
సాక్షి ఒడిశా

మంగళవారం । 14 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,43,303లు, బంగారం 600 మిల్లీగ్రాములు, వెండి 43 గ్రాములు 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేడుకగా.. వెలుగుల పండగ

వెలుగుల పండుగ దీపావళిని రాష్ట్ర ప్రజలంతా వేడుకగా ఆదివారం జరుపుకున్నారు.

- 8లో



శ్వేతపత్రం విడుదల చేయాలి

పూరీ జగన్నాథ ఆలయ వారసత్వ ప్రాకార ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది.

- 8లో

న్యూస్‌రీల్

పంట పొలాల్లోకి జగన్నాథ్ సాగర్ నీరు



సాగర్ నుంచి విడిచిపెడుతున్న నీరు(ఫైల్)

జయపురం: స్థానిక చారిత్రాత్మక జగన్నాథ సాగర్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఉన్న నీటిని బయటకు వదిలేందుకు, పూడికను తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా గత శుక్రవారం నుంచి సాగర్‌లో నీటిని బయటకు విడిచిపెడుతున్నారు. అయితే ఆ నీరు జగన్నాథ్ సాగర్ నుంచి జయనగర్ మీదుగా పంట పొలాల్లోకి వెళ్తోంది. పంటలు కోతకు వచ్చే సమయానికి పొలాల్లోకి నీరు చేరుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటివలన దాదాపు 20 ఎకరాల్లో పంటలకు ముప్పు వాటిల్లుతుందని వాపోతున్నారు. తాము ఎకరాకు రూ.40 వేలు చొప్పున ఖర్చు చేశామని, ఈ ఏడాది సక్రమంగా దిగుబడి వస్తుందనే ఆశతో ఉన్నామన్నారు. రానున్న 15 దినాల్లో పంటలు కోసేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే పొలాల్లోకి ఎక్కువగా నీరు రావడం వలన కోతలకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

16న దేశవ్యాప్త ఆందోళనలు



సమావేశంలో పాల్గొన్న ప్రమోద్ మహంతి తదితరులు

జయపురం: ఈనెల 16వ తేదీన పెన్షనర్ల డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టి, ప్రధానమంత్రికి ఉద్దేశించిన వినతిపత్రాలు కలెక్టర్లకు సమర్పించాలని జాతీయ ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపునిచ్చిందని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి తెలియజేశారు. ఈ మేరకు స్థానిక యాదవ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ కాంత రథ్ అధ్యక్షత ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆందోళనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెన్షన్‌దారులకు కనీసం రూ.9 వేల పెన్షన్ చెల్లించాలని, పెన్షన్‌తో డీఏ కలపాలని, అందరినీ బిజు పట్నాయక్ ఆరోగ్య పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు అంగీకరించకపోతే డిసెంబర్ 12వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధార్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆ మహాధర్నాలో ఒడిశా నుంచి 30 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సేవా పేపర్ మిల్లు విశ్రాంత శ్రామికులకు బకాయి జీతాలు నేటికీ చెల్లించనందుకు పేపర్ మిల్లు యాజమాన్యానికి లేఖ రాయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో జి.ప్రసాదరావు, దండపాణి పాత్రో, కైలాస పండ పాల్గొన్నారు.

దారుణం

- మద్యం తాగేందుకు రూ.100 ఇవ్వలేదని హత్య



అరెస్టైన మధు నాయక్

జయపురం: సారా తాగేందుకు రూ.100 ఇవ్వకపోవడంతో హత్యకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తెలియజేశారు. మరణించిన వ్యక్తి రామచంద్ర నాయిక్ కాగా అతడిని చంపిన వ్యక్తి మృతుని చిన్నాన్న కుమారుడు కావడం గమనార్హం. సదర్ పోలీసుస్టేషన్ పరిధి దుంగిరిగుడ గ్రామానికి చెందిన చైతన్య నాయిక్ ఇచ్చిన ఫిర్యాదులో తన కుమారుడు రామచంద్ర నాయిక్ సేవా పేపరు మిల్లులో పని చేస్తున్నాడని తెలియజేశారు. ఈనెల 11వ తేదీన పేపరు మిల్లు నుంచి నడచుకుంటూ ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో, మిల్లు కూడలి వద్ద వరుసకు సోదరుడైన మధు నాయిక్ రామచంద్రను సారా తాగేందుకు రూ.100 అడిగాడు. అయితే తాగుడికి తాను డబ్బులు ఇవ్వనని రామచంద్ర చెప్పడంతో కోపంతో తన వద్దనున్న వెదురు కర్రతో తలపై తీవ్రంగా కొట్టాడని, ఆ దెబ్బతో రామచంద్ర కిందపడ్డాడన్నారు. వెంటనే అతడిని స్థానికులు స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిశీలించిన డాక్టర్లు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నిందితుడు మధు నాయిక్‌ను ఆదివారం అరెస్టు చేశామని, అతడు కొట్టేందుకు వినియోగించిన వెదురు కర్రను సీజ్ చేశామని పోలీసులు తెలియజేశారు.

వణికిస్తున్న.. చలిపులి



మంచు కమ్ముకున్న కళింగా ఘాట్ రోడ్




రాత్రి 7 గంటలకే నిర్మానుష్యంగా మారిన పుల్బణి పట్టణం



కురిసిన మంచును చూపిస్తున్న స్థానికులు



మంచుతో కప్పబడిన అటవీ ప్రాంతం



పుల్బణి పట్టణంలో కురిసిన మంచు

కొందమాల్ జిల్లాలో చలిపులి వణికిస్తోంది. ఒడిశా కాశ్మీర్‌గా పేరుగాంచిన దరింగబడిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పుల్బణి, దరింగబడి, కోట్‌గడ్, జి.ఉదయగిరి, బల్లిగుడా, తుమ్మడిబొందో, రైకియా, పిరిగింయా, బలందపడా, బ్రహ్మణిగామ్‌లలో చలి తీవ్రత అమాంతం పెరిగింది. దరింగబడి, పుల్బణిలో పగలు ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు ఉండగా, రాత్రి ఉష్ణోగ్రత 4 నుంచి 6 డిగ్రీలకు తగ్గిపోతోంది. కాగా చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ విదేశీ పర్యాటకులు మరియు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. గతేడాది దరింగబడి మరియు పుల్బణి అత్యధిక 3 డిగ్రీలకు పడిపోగా, ఈ ఏడాది 0 డిగ్రీల వరకు ముందుముందు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలియజేసింది. ప్రస్తుతం కొందమాల్ జిల్లాలో పగలు 10 గంటలు దాటనిదే సూరీడు కనిపించడం లేదు. దీంతో చలి తీవ్రత తట్టుకునేందుకు సాయంత్రం నుంచి మంటలు వేసుకుంటున్నారు. చలి తీవ్రత పెరగడంతో పాఠశాలలను ఉదయం 10 గంటలకు తెరవాలని జిల్లా విద్యాశాఖకు కొందమాల్ కలెక్టర్ ఆశిస్ ఈరోపతి ఆదేశాలు జారీ చేశారు.

– బరంపురం



దరింగబడిలో మంటలు వేసుకొని చలి కాగుతున్న ప్రజలు

తుది దశకు వారసత్వ ప్రాకార పనులు



పూరీ జగన్నాథ దేవస్థానం

- జనవరి 17న భక్తులకు అంకితం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయం వారసత్వ ప్రాకార ప్రాజెక్టు పనులు తుది దశకు చేరాయి. వచ్చే ఏడాది జనవరి 17న భక్తులకు అంకితం చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కార్యాచరణ తుది మెరుగులు దిద్దుకుంటోంది. గుండిచా నుంచి శ్రీమందిరం వరకు దాదాపు 3 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన బొడొ దండొ (గ్రాండ్ రోడ్డు) దారి పొడవునా ఇరువైపులా ఉన్న నివాస భవనాలు, హోటళ్లు, దుకాణాలు, కార్యాలయాలు ఇతరేతర నిర్మాణాలు, కట్టడాలకు ఒకే రంగుతో ఏకరీతిలో అలంకరించేందుకు నిర్ణయించారు. వారసత్వ ప్రాకార శోభతో భక్తులకు అంకితం చేయడానికి ముందే ఆయా నిర్మాణాలు, కట్టడాల యజమానులు రంగు వేయడం పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ధారిత గడువులోగా ఈ పని పూర్తి చేయకుంటే ఆలయ యాజమాన్యం పూర్తి చేస్తుంది. అనుబంధ ఖర్చులను యజమాని నుంచి వసూలు చేస్తుందని స్పష్టం చేయడం విశేషం.

లేత గులాబీ రంగు వేయాలని..

బొడొదండొ పొడవునా ఇరువైపుల ఉన్న కట్టడాలకు లేత గులాబీ రంగు వేయాలని ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు జారీ చేయనుంది. 5టీ చైర్మన్ వి.కె.పాండియన్ ఇటీవల పూరీని సందర్శించినప్పుడు ప్రతిపాదిత 14 రంగుల నుంచి లేత గులాబీ రంగును ఖరారు చేశారు. స్థానికుల అభీష్టం మేరకు అవసరమైతే వాటిని మార్చుకునేందుకు అనుబంధ వర్గాలకు వెసులుబాటు కలిస్తారు. బొడొదండొ వెంబడి ఉన్న అన్ని భవనాల యజమానులు తమ కట్టడాలకు లేత గులాబీ రంగు పూత వేసేందుకు నిర్ధారిత మార్గదర్శకాలు రూపుదిద్దుంకుటున్నాయి. గడువులోగా ఎవరైనా విఫలమైతే పాలనా యంత్రాంగం ఈ పనులు చేపడుతుంది. అయితే భవన యజమానులు మొత్తం ఖర్చును భరిస్తారని పూరీ జిల్లా యంత్రాంగం అధికారి ఒకరు తెలిపారు.

పాత యోచనే

జగన్నాథుని నవ కళేబర ఉత్సవం పురస్కరించుకుని 2015 సంవత్సరంలో బొడొ దండొ పరిసరాల్లో కట్టడాలు, నిర్మాణాలకు దంతపు రంగు పూత పూయించారు. ఈ పూత క్రమంగా పేలబారింది. అనంతరం పూరీ వారసత్వ ప్రాకార ప్రాజెక్ట్ వెలుగు చూసింది. 2016 సంవత్సరంలో తొలిసారిగా ఈ ప్రాజెక్టు రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. యాత్రికుల పట్టణాన్ని అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన వారసత్వ ప్రదేశంగా మార్చే లక్ష్యంతో డిసెంబర్ 2019 సంవత్సరంలో శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు రూపురేఖలు ఖరారయ్యాయి. రూ.800 కోట్ల ప్రాజెక్ట్‌లో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలను సందర్శకులు మరియు పర్యాటకుల కోసం ఆలయ పరిసర ప్రాంతాలను పునరాభివృద్ధి చేయడంతో మేఘనాథ్ ప్రహరి (దేవస్థానం వెలుపలి గోడ) చుట్టూ అడ్డంకులు లేని 75 మీటర్ల ప్రాకారం అత్యంత ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటోంది. ఆలయ సరిహద్దు గోడకు 55 మీటర్ల పరిధిలో అందుబాటులో ఉండే సౌకర్యాల్లో ఆరు మరుగుదొడ్లు మరియు ఆలయానికి దక్షిణం, ఉత్తరం మరియు పడమర దిశలలో మూడు ఆశ్రయ కేంద్రాలు ఉన్నాయి. 6,000 మంది సామర్థ్యంతో శ్రీమందిర్ రిసెప్షన్ సెంటర్, జగన్నాథ్ కల్చరల్ సెంటర్, రఘునందన్ గ్రంథాలయం, బొడొదండొ వారసత్వ వీధి, జగన్నాథ్ వల్లభ్ యాత్రికుల సముదాయం, బహుళస్థాయి కారు పార్కింగ్ మరియు ఇతర సౌకర్యాలు ఉంటాయి.

వైభవం.. కాళీమాత దర్శనం



బరంపురం: మిలట్రీ లైన్‌లోని బెంగాలీ వీధిలో...

రాష్ట్రంలోని పలుచోట్ల కాళీ పూజలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా రాయగడలోని దక్షిణ కాళీ మందిరం, పర్లాకిమిడి, బరంపురంలోని కొడాసింగ్ జంక్షన్, మిలట్రీ లైన్, బెంకాళీ వీధిలోని శ్యామ కాళీ, గేట్ బజార్ జంక్షన్, కొత్త బస్టాండ్, పెద్ద బజార్, రైల్వేస్టేషన్ రోడ్డులో కాళీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నది తీరాల నుంచి శుద్ధ జలాలను తీసుకొచ్చి కాళీమాత అమ్మవారి పూజా ప్రాంగణంలో శుద్ధి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆహ్వాన, ప్రాణ ప్రతిష్ఠ పూజలను పురోహితులు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– బరంపురం, రాయగడ



బరంపురం: కొడాసింగ్‌లో ప్రత్యేక పూజలందుకుంటున్న కాళీమాత



బరంపురం: గేట్ బజార్ జంక్షన్‌లో...



బరంపురం: గుసానినువాగంలో...



మల్కన్‌గిరి: బలిమెలలో కొలువైన కాళీమాత విగ్రహం



భువనేశ్వర్: కటక్ ఖాన్ నగర్ ప్రాంతంలో కొలువుదీరిన కాళీమాత



బరంపురం: స్టేషన్ రోడ్‌లో...



రాయగడ: పూజలందుకుంటున్న దక్షిణ కాళి



రాయగడ: పూజలకు సన్నాహాలు చేస్తున్న పురోహితులు



పర్లాకిమిడి: పర్లాకిమిడి నెహ్రూ జంక్షన్ వద్ద శ్యామకాళీ

క్లుప్తంగా

ఉత్తరాఖండ్‌లో కుప్పకూలిన సొరంగం

- ప్రమాదంలో చిక్కుకున్న 5 మంది ఒడిశా కార్మికులు

భువనేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ జిల్లా యమునోత్రి జాతీయ రహదారిపై ఆదివారం కొండ చరియలు విరిగిపడడంతో నిర్మాణంలో ఉన్న సొరంగం కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో 40 మంది కార్మికులు చిక్కుకున్నారు. వీరిలో 5 మంది ఒడిశాకు చెందినవారు ఉన్నారు. నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో తలమునకలై ఉన్న 40 మంది బాధితులు ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో ఐదుగురు ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. వారిలో మయూర్‌భంజ్ జిల్లా నుంచి బిశ్వేశ్వర్ నాయక్ (మహేశ్వర్ నాయక్ కుమారుడు), ఖుర్దా జిల్లాలోని శంకర్షణ్‌పూర్ నుంచి తపన్ మండల్ (మంటూ లాల్ మండల్ కుమారుడు), బాలాసోర్ జిల్లాలోని కులాడిహా నుంచి రాజు నాయక్, నవరంగ్‌పూర్ నుంచి భగవాన్ భాత్రా (మంటూ భాత్రా కుమారుడు) మరియు సంబల్‌పూర్ జిల్లా బొడొకుదరొ నుంచి ధీరెన్ ఉన్నట్లు సమాచారం. చార్ ధామ్ ప్రాజెక్టులో భాగంగా సిల్క్యారా నుంచి దంగల్ గావ్‌కు అనుసంధానం చేసే సొరంగంలో కొంతభాగం ఆదివారం కుప్పకూలింది. ఈ ప్రమాదకర సంఘటనలో ఎలాంటి మరణం సంభవించలేదు. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) ఇతర సహాయక బృందాలు కుప్పకూలిన సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించే పనిలో నిమగ్నమై ఉన్నారని ఉత్తరాఖండ్ అదనపు డైరెక్టరు జనరల్ (శాంతిభద్రతలు) ఏపీ అన్షుమాన్ తెలిపారు.

ముఖ్యమంత్రి ఆందోళన

సొరంగం కూలిపోవడంతో రాష్ట్రానికి చెందిన కార్మికులు సహా పలువురు కార్మికులు చిక్కుకుపోవడంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరూ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్న నూతన డీగ్రీ+బీఎడ్ కోర్సుల దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీ నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13తో దరఖాస్తుల స్వీకరణ ముగియగా, 15వ తేదీ సాయంత్రం వరకు పెంచినట్లు చెప్పారు. ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోర్సులో చేరేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023 పరీక్ష రాసిన వారు అర్హులని పేర్కొన్నారు. వారు సాధించిన మార్కుల స్కోర్ ఆధారంగా ఈ ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. మొత్తం 110 సీట్లు ఉండగా, ఈ నెల 16న మెరిట్ లిస్ట్ సిద్ధం చేస్తామని అన్నారు. నేరుగా, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు.

మల్లన్న సన్నిధిలో ఆకాశ దీప ప్రజ్వలన


రావివలస మల్లన్న సన్నిధిలో ఆకాశ దీప ప్రజ్వలన చేస్తున్న అర్చకులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయ సన్నిధిలో సోమవారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు టి.శివకుమార్, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, పండితుడు సురేష్ ఆధ్వర్యంలో ఆకాశ దీప ప్రజ్వలనతో కార్తీక మాసోత్సవాలు ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-19 బాలబాలికల అథ్లెటిక్స్ సెలెక్షన్స్ ట్రయల్స్ బుధవారం జరగనున్నాయని జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీవీఈఓ కోట ప్రకాశరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, పీడీ బీవీ రమణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం క్రీడా ప్రాంగణం వేదికగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన స్టడీ సర్టిఫికెట్‌ను తమ వెంట విధిగా తీసుకురావాలని వారు కోరారు.

నేడు జిల్లా అండర్-19 హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-19(ఇంటర్మీడియెట్, డిగ్రీ ఫస్టియర్) బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు మంగళవారం జరగనున్నాయని జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీవీఈఓ కోట ప్రకాశరావు, కార్యదర్శి బీవీ రమణ తెలిపారు.


బరంపురం: చిన్న బజార్‌లో...


బరంపురం: గాంధీనగర్ దీపావళి వేడుకలు...


జయపురం: ఒక ఇంటిలో దీపావళి పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు


జయపురం: కాకర పువ్వు కాల్చుతున్న చిన్నారి

వేడుకగా... వెలుగుల పండగ

వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే కాకర పువ్వులు, భూచక్రాలు, తారాజువ్వల వెలుగులతో వీధులన్నీ మెరిసిపోయాయి. చిన్నా.. పెద్దా తారతమ్యం లేకుండా కొత్త దుస్తులు ధరించి.. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. ఇళ్లలో, ఆలయాల్లో పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్


రాయగడ: దీపావళిలో చిన్నారుల సందడి


పర్లాకిమిడి: బి.సీతాపురం ఉత్కళ బాలాశ్రమంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్


జయపురం: వెలుగు చిమ్ముతున్న చిచ్చుబుడ్డి


జయపురం: ఆకాశ దీపం వదులుతున్న దృశ్యం


కొరాపుట్: పండిట్ దీన్ దయాళ్ ఆశ్రమంలో దీపావళి పండగ చేస్తున్న లైన్స్ క్లబ్ సభ్యులు


జయపురం: ఒక ఇంటి ముందు దీపాలు వెలిగించిన దృశ్యం



రాయగడ: ఇంటి ముందు వేసిన రంగవల్లులు

క్షీణించిన వాయు నాణ్యత

భువనేశ్వర్: ఐదు రోజుల వ్యవధిలో రాష్ట్ర రాజధానిలో గాలి (వాయు) నాణ్యత మధ్యస్థ కాలుష్యం నుంచి పేలవించి అట్టడుగు స్థాయికి పడిపోయింది. దీపావళి వేడుకల తర్వాత రాష్ట్రంలో భువనేశ్వర్ మరియు ఇతర ప్రాంతాల్లో ఈ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీపావళికి ముందు, భువనేశ్వర్‌లో సగటు రోజువారీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) మరియు పీఎం 2.5 మరియు పీఎం 10 స్థాయిల్లో ఒక మోస్తరు పరిధిలోనే ఉండేది. ఆదివారం కొన్నిచోట్ల ఈ పరిస్థితి 300కి పెరిగింది. సోమవారం ఉదయం 6.40 గంటలకు నగరంలోని ఏక్యూఐ 182, 7.40 గంటలకు 175, మధ్యాహ్నం 12.50 గంటలకు 168గా నమోదైంది. భువనేశ్వర్‌లో ప్రస్తుత పీఎం 2.5 సాంద్రత ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన 24 గంటల గాలి నాణ్యత మార్గదర్శకాల విలువ పరిమితి కంటే 6 రెట్లు అధికంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. పటాకుల వాడకంపై సుప్రీంకోర్టు జారీ చేసిన ఆంక్షలతో హరిత బాణాసంచా వినియోగానికి పోలీసులు జారీ చేసిన మార్గదర్శకాలు దారి తప్పాయి. దీపావళి వేడుకల సందర్భంగా కాలుష్యాన్ని అరికట్టేందుకు చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలమైనట్లు కనిపిస్తోంది.

నిబంధనలు గాలిలోకి...

రాష్ట్ర రాజధానిలో కమిషనరేట్ పోలీసులు జారీ చేసిన నిబంధనలు గాలిలో కలిసిపోయాయి.


బాణాసంచా కాల్చుతున్న దృశ్యం

బాణాసంచా కాల్చేందుకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతించారు. ఈ పరిమితికి మించి సుమారు అర్ధరాత్రి వరకు నగరంలో బాణాసంచా పేలుడు సందడి తారసపడింది. దీంతో నగరం మరియు పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ ఆవరించి దృశ్యమానతను గణనీయంగా తగ్గించింది. ఒడిశా కాలుష్య నియంత్రణ మండలి కూడా దీపావళి సందర్భంగా పటాకులు పేల్చడంపై ఆంక్షలు విధించింది. భువనేశ్వర్‌లో పెద్దగా పారిశ్రామిక స్థావరాలు లేనప్పటికీ 16వ నంబర్ జాతీయ

ప్రాంతం	వాయు నాణ్యత విలువ (ఏక్యూఐ)
భువనేశ్వర్	పేలవం
కటక్	పేలవం
బాలాసోర్	పేలవం
అంగుల్	పేలవం
కెంజొహర్	మోస్తరు
రౌర్కెలా	మోస్తరు

రహదారిపై నిత్యం భారీ వాహనాల రవాణాతో నిర్మాణ కార్యకలాపాలు నగరంలో గాలి నాణ్యత క్షీణించడానికి భారీగా దోహదపడతాయని ఈ సంస్థ పేర్కొంది. ఉష్ణోగ్రత విలోమం ప్రధానంగా శీతాకాలంలో వాతావరణం యొక్క దిగువ పొరల నుంచి కాలుష్య కారకాల పెరుగుదల మరియు వ్యాప్తిని మరింత నిరోధిస్తుందని వివరించింది. పీఎం 10 కాలుష్య కారకాలు దాదాపు 6 గంటల పాటు గాలిలో తేలియాడుతాయి మరియు పీఎం 2.5 మరింత అధిక సమయం ఈ పరిస్థితిని కలిగి ఉంటుంది. అధిక సాంద్రత కాలుష్య కణాలు కళ్లు, ముక్కు మరియు గొంతును ప్రభావితం చేస్తాయి. సూక్ష్మమైన కణాలు ఊపిరితిత్తుల లోతైన భాగాలలోకి ప్రవేశించి దగ్గు మరియు ఆస్తమా వంటి అనారోగ్య పరిస్థితులకు కారణమవుతాయి. రక్తంలోకి కూడా ప్రవేశించి తీవ్ర అనారోగ్యం ప్రేరేపిస్తాయని ఓపీసీబీ తెలిపింది.

శ్వేతపత్రం విడుదల చేయాలి


మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్

- పూరీ వారసత్వ ప్రాకార ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ డిమాండ్
- డిసెంబర్ 1 నుంచి తులసీ యాత్ర
- ఇంటింటా తులసీ దళాల సేకరణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయ వారసత్వ ప్రాకార ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది. మందిరం నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించింది. ఈ చర్యకు నిరసనగా ఈ డిసెంబర్ 1 నుంచి 'తులసి యాత్ర'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. స్థానిక కాంగ్రెసు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఈ విషయం తెలిపారు.

తులసీ యాత్ర

రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీజగన్నాథుని ఆలయం నిర్వహణ కార్యకలాపాల్లో అవకతవకలకు నిరసనగా తులసీ యాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రంలోని 314 మండలాల్లో ఇళ్ల నుంచి తులసీ దళాలు సేకరించి, ఆలయంలో జగన్నాథునికి సమర్పిస్తామని పీసీసీ చీఫ్ చెప్పారు. తులసీ యాత్రలో రాష్ట్ర ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాచీన పుణ్యక్షేత్రం పూరీలో జరిగిన దుర్వినియోగానికి వ్యతిరేకంగా పార్టీ నిరసనను వ్యక్తం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పేర్కొన్నారు. జగన్నాథ ఆలయం నాలుగు ద్వారాలు మరియు రత్న భాండాగారం తెరవడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. తులసీ యాత్ర శ్రీ జగన్నాథుని భక్తులలో భారీ అవగాహన కలిగిస్తుంది. 1978 సంవత్సరం నుంచి మూసివేయబడిన రత్న భాండాగారం (ఖజానా లోపలి మిద్దె), కరోనా తాండవంతో మూసివేసిన ఆలయం నాలుగు ద్వారాలు తెరవాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. వారసత్వ ప్రాకార ప్రాజెక్టు పనుల కారణంగా శ్రీమందిరం మూడు ద్వారాలను తెరవలేకపోతున్నామని శ్రీ జగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) రంజన్ కుమార్ దాస్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జనవరి 17న ఈ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈలోగా ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించిన సమగ్ర వివరాల్ని శ్వేత పత్రంగా విడుదల చేయాలని ఓపీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రసాద్ హరిచందన్ డిమాండ్ చేశారు. భావితరాలకు ఈ ప్రాజెక్ట్ గురించిన అన్ని వివరాలను కోరుతున్నామని ఆయన చెప్పారు.

ద్వారాల మూతతో భక్తుల వెతలు

ద్వారాలు మూసివేయడంతో స్వామి దర్శనం కోసం విచ్చేసే భక్తులు, యాత్రికులు వర్ణనాతీతమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఆలయం నలువైపులా ఉన్న ద్వారాల్లో ఒక్క సింహ ద్వారం మాత్రమే తెరిచి మిగిలిన 3 ద్వారాల్ని మూసేశారు. దీంతో రద్దీ నియంత్రణ చేయి దాటి పోతుంది. ఈ పరిస్థితుల నివారణ లక్ష్యంగా తులసీ యాత్ర చేపడుతున్నట్లు ప్రసాద్ హరిచందన్ వివరించారు. ఇటీవల రద్దీ నియంత్రణ వైఫల్యంతో తొక్కిసలాట చోటు చేసుకుని 10 మంది హబిషాలీలు ఆస్పత్రి పాలైన విషయం ఉదాహరణగా పేర్కొన్నారు. కార్తీక మాసం చివరి ఐదు రోజుల్లో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. కార్తీకం చివరి 5 రోజులు పంచుకగా వ్యవహరించి స్వామి దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు.

ఈ సమయంలో తొక్కిసలాట వంటి అవాంఛనీయ ప్రమాదాలను నివారించడానికి శ్రీమందిరం నలువైపుల ఉన్న ద్వారాలను తెరిచి దర్శనం కోసం వచ్చి పోయే వారికి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆలయాన్ని సందర్శించే భక్తుల భద్రత, 1978లో చివరిసారిగా తెరిచిన రత్న భాండాగారం లోపలి మిద్దె తెరిచి దానిలో ఖజానా వివరాల్ని బహిరంగపరచాలని దీర్ఘకాలంగా డిమాండు చేస్తున్నట్లు వివరించారు. తులసీ యాత్ర ఉద్యమానికి కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



జయపురం: చౌడేశ్వరి మందిరంలో శివునికి దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక సోమవారం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఒడియా వారికి ఇది మూడో సోమవారం కాగా, తెలుగు ప్రజలకు ఇది మొదటి సోమవారం. అందువలన భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జయపురం: చౌడేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: ఎండల మల్లికార్జునుడు


జయపురం: గుప్తేశ్వర్‌లో పూజలందుకుంటున్న శివలింగం


జయపురం: గుప్తేశ్వర్‌లో బారులుతీరిన భక్తజన సందోహం

జీపీఎల్ విజేత గుణుపూర్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ మినీ స్టేడియంలో గత వారం రోజులుగా జరుగుతున్న గుణుపూర్ ప్రీమియం లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఫైనల్‌కు రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలియజేశారు. అనంతరం టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన గుణుపూర్ జట్టుకు రూ.66,666 నగదు, రన్నర్‌గా నిలిచిన గుడారి జట్టుకు రూ.44,444ల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో గుణుపూర్ మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడో, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో, హౌసింగ్ బోర్డు అధ్యక్షుడు రాజేంద్ర సావుకార్ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నెక్కంటి

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


రేగులవలస సత్యవతి (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రేగులవలస సత్యవతి(104)శనివారం రాత్రి ఇంటి వద్ద మృతి చెందింది. ఆమె కుమారుడు తిరుపతిరావు పోరలి పీఏసీఎస్‌లో కార్యదర్శిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. మనుమడు రమేష్ దత్తిరాజేరు తహసీల్దార్‌గా విధుల్లో ఉన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధిలోని తాలాడ గ్రామానికి చెందిన రాగోలు అప్పన్న, కుప్పిలి సీతప్పయ్యలు ఆదివారం రాత్రి భోజనం విషయంలో గొడవ పడి ఇరు కుటుంబాలు కొట్టుకున్నాయి. దీంతో ఆయా కుటుంబాల పరస్పర ఫిర్యాదుల మేరకు రెండుకేసులు నమోదయ్యాయి. సోమవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు.

ప్రాథమికంగా రుజువైతే పోక్సో కేసు

- రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: పూసపాటిరేగ మండలంలోని చోడమ్మ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అనుచిత ప్రవర్తన ఆరోపణల్లో ప్రాథమిక నిర్ధారణ జరిగితే పోక్సో-2012 యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు వై.అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి విచారణకు ఆదేశాలివ్వడం అభినందనీయమన్నారు. ప్రాథమిక విచారణలో తల్లిదండ్రుల ఫిర్యాదులోని అంశాలు రుజువని తేలితే వెంటనే ఆ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేసి పోక్సో యాక్ట్ ద్వారా కేసు నమోదు చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న రైతులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన పాలినేటి సత్యనారాయణ, కనకల శ్రీనివాసరావుల వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు సంబంధిత రైతులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి విలేకరులకు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా పగులగొట్టి అందులో ఉన్న విలువైన కాపర్ వైర్లను దొంగిలించినట్లు ఫిర్యాదు అందిందని చెప్పారు. ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ప్రదేశానికి సిబ్బందితో వెళ్లి పరిశీలించనున్నట్లు స్పష్టం చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులకు సమాచారం తెలియజేసి కేసు నమోదు చేసేలా దృష్టి సారిస్తానన్నారు. వ్యవసాయ పొలాల్లో చోరీలకు గురవుతన్న ట్రాన్స్‌ఫార్మర్‌లపై దృష్టిసారించాలని పోలీసు సిబ్బందిని కోరనున్నట్లు చెప్పారు.

బస్సు నుంచి జారి పడి వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో శశికిరణ్ మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం బీసీ కాలనీ వద్ద సాలూరు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన కె.శశికిరణ్ (40) మృతి చెందినట్లు ఎస్సై శిరీష తెలిపారు. సోమవారం జరిగిన ఈ ఘటనపై ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శశికిరణ్ సాలూరు నుంచి విజయనగరానికి బస్సులో వెళ్తుండగా కాలు జారి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు. మృతదేహాన్ని గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట పొలాల్లో ఏనుగులు

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస పంటపొలాల్లో ఏడు ఏనుగుల గుంపు సోమవారం సంచరించాయి. పంటలకు నష్టం వాటిల్లుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏనుగుల తరలింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే సుగర్ పరార్..!

ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, మానసిక ఒత్తిడి, ధూమపానం, ఊబకాయం, మద్యం అధికంగా తీసుకోవడం, కుటుంబసమస్యలు తదితర కారణాల వల్ల చాలామంది మధుమేహం (సుగర్) వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం గతంలో 50, 60 సంవత్సరాల వయసు వారికే వచ్చేది. కానీ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వ్యాధి వచ్చేస్తోంది. మధుమేహాన్ని వ్యాధిగా కాకుండా ఆరోగ్య సమస్యగా భావించాలి. ఆహార నియమాలు పాటిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. మధుమేహం వచ్చిందంటే అదుపు చేయడం చాలా కష్టం. మంగళవారం ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. – విజయనగరం ఫోర్ట్

- మధుమేహ వ్యాధి పట్ల అప్రమత్తం అవసరం
- జిల్లాలో 1.50 లక్షల మంది వ్యాధిగ్రస్తులు
- ఏటా 10 వేల మంది కొత్త వారికి వ్యాధి

తినే ఆహారంలో కూడా చక్కెర ఉంటుంది. మోతాదుకు మించిన ఆహారం తింటే శరీరంలో చక్కెరస్థాయి కూడా పెరిగిపోతుంది. దాన్ని కంట్రోల్ చేసే సామర్థ్యం శరీరానికి లేకపోతే క్రమేణా మధుమేహంగా మారిపోతుంది.

కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ తగ్గడం వల్ల చాలా మంది చిన్న వయసులోనే మధుమేహం బారిన పడుతున్నారు. సరైన వేళకు భోజనం, నిద్ర లేకపోవడం మధుమేహానికి దారితీస్తోంది. వంశపారంపర్యంగా తల్లిదండ్రులు, వారి ముందు తరాల నుంచి కూడా టైప్-2 మధుమేహం వస్తుంది. వైరస్ ఇన్ఫెక్షన్లు, హార్మోన్ల అసమతుల్యత వల్ల మధుమేహం రావచ్చు.

వ్యాధి లక్షణాలు

తరచూ మూత్రం రావడం, దాహం వేయడం, గొంతు ఎండిపోతున్నట్లు ఉంటుంది. ఆకారణంగా బరువు తగ్గడం, బాగా నీరసం. చూపు మందగించడం, పంటి చిగుళ్లలో ఇన్ఫెక్షన్లు వస్తాయి. శరీరానికి అయ్యే గాయాలు త్వరగా మానవు. అతిగా ఆకలి వేయడం, కాళ్లలో స్పర్శ తగ్గడం ఉంటుంది. కొంతమందికి కాళ్లు తిమ్మిర్లు ఎక్కుతాయి. కొందరిలో తరచూ ఆయాసం, వాంతులు, విరేచనాలు, చర్మం, మర్మావయవాల వద్ద ఇన్ఫెక్షన్ కనిపించవచ్చు. చర్మం ముడత పడుతుంది.


ఎన్‌సిడి క్లీనిక్‌లో వృద్ధుడికి సుగర్ టెస్టు చేస్తున్న స్టాఫ్‌నర్స్


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణికి పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎం

మధుమేహ స్థాయి ఇలా..

రక్తంలో గ్లూకోజ్ స్థాయి పరగడుపున చేసే పరీక్షల్లో 90 నుంచి 110 మిల్లీ గ్రాములు, భోజనం చేసిన తర్వాత 110 నుంచి 160 మిల్లీగ్రాములు ఉంటే మధుమేహం లేనట్లే. పరగడుపున గ్లూకోజ్ స్థాయి 110నుంచి 126 మిల్లీ గ్రాములు ఉంటే మధుమేహం రావడానికి అస్కారం ఉంటుంది. అదేవిధంగా భోజనం చేసిన తర్వాత గ్లూకోజ్ స్థాయి 160 నుంచి 200 మిల్లీగ్రాములు ఉన్నా మధుమేహం వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ స్థాయిలు ఉన్నప్పుడు సరైన ఆహార నియమాలు పాటిస్తే మందులు వాడకుండానే మధుమేహానికి దూరంగా ఉండవచ్చు.

వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శారీరక శ్రమ కోసం వ్యాయమం, నడక, ఇతరత్రా పనులు చేయాలి. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. ఆఫీసులో ఎక్కువ సేపు కూర్చుని పనిచేయాల్సి వచ్చినప్పుడు మధ్య మధ్యలో పైకి లేచి చిన్న చిన్న వ్యాయమాలు చేయాలి. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, వేపుళ్లు, తదితర వంటకాలకు దూరంగా ఉండాలి. మధుమేహం ఉన్న వారు వైద్యులు ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడాలి. గర్భిణులు తరచూ మధుమేహ పరీక్ష చేయించుకోవాలి. పాదాల మీద చర్మం కందిపోవడం, గాయాలు, పుండ్లు ఏవైనా ఉన్నాయేమో గమనిస్తుండాలి. మద్యం, పొగ తాగడం మానివేయాలి. మధుమేహం ఉన్నవారు అరటి, సీతాఫలం, మామిడి, సపోటా పండ్లు తినకూడదు. తీపి పదార్థాలకు, దుంపలకు దూరంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారికి గుండె జబ్బులు, బీపీ ఉన్నట్లయితే వాటిని అదుపులో ఉంచుకోవాలి.

ఏటా పదివేల మందికి వ్యాధి

జిల్లాలో 1.50 లక్షల మంది మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారు. ఏటా కొత్తగా 10 వేల మంది వరకు వ్యాధి బారిన పడుతున్నారు. వారిలో అధిక శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స తీసుకుంటున్నారు. కొంతమంది మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల దగ్గరకే వెళ్లి బీపీ, సుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులను అందిస్తోంది. అలాగే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో బీపీ, సుగర్ పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా ప్రభుత్వం మందులు అందిస్తోంది.

శారీరక శ్రమ చేయాలి



మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్ జోలికి వెళ్లకూడదు. శారీరక శ్రమ ప్రతి రోజు చేయడం వల్ల వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. మధుమేహ నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు పాటించాలి. మధుమేహం ఉన్న వారు వైద్యుని సలహా ప్రకారం మందులు వాడుతూ సూచించిన జాగ్రత్తలు, ఆహారం తీసుకోవాలి. సమయానికి తినడం, నిద్ర పోవడం చేయాలి. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి బీపీ, సుగర్, గుండె పరీక్షలు చేసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. మాంసాహారం తక్కువగా తినాలి.

– డాక్టర్ గాడి మురళీ కృష్ణ, ఎన్‌సీడీ వైద్యాధికారి

స్క్వేర్ మార్షల్ ఆర్ట్స్‌లో నిరంజన్‌కు కాంస్యం


కాంస్య పతకంతో నిరంజన్ ప్రసాద్

విజయనగరం: జాతీయస్థాయి స్క్వేర్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన నిరంజన్ ప్రసాద్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 7 నుంచి 9వరకు గోవాలో జరిగిన పోటీల్లో 216 మంది పాల్గొనగా, జిల్లాకు చెందిన నిరంజన్ మూడవ స్థానంలో నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది బాలురు, 8 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 58 కేజీల విభాగంలో కాంస్య పథకం సాధించిన నిరంజన్ ప్రసాద్‌ను సెట్విజ్ సీఈవో రాంగోపాల్‌తో పాటు పలువురు అభినందించారు.

15న అండర్-19 అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 15న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికపోటీల్లో పాఠశాల విద్యనభ్యసిస్తున్న 8,9,10 విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ అభ్యసిస్తూ 19 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

జూనియర్స్ ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- 26 నుంచి నరసారావుపేటలో రాష్ట్రస్థాయి పోటీలు


రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోయే జిల్లా ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు బాల, బాలికలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్‌జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు సోమవారం పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 250 మంది బాల, బాలికలు హాజరు కాగా.. జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి చింత సత్యనారాయణ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20మంది బాలికలు, 20 మంది బాలురను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తుది జట్టులో స్థానం కల్పించనున్నారు. జిల్లా జట్లకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 26,27,28 తేదీల్లో నరసారావుపేటలో జరగనున్న అంతర్‌జిల్లా బాల, బాలికల ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, కోశాధికారి బి.మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, బి.శ్రీను, టి.సత్యనారాయణలతో పాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కేఏ.బాలకృష్ణ ఏఎస్‌ఎం.కమలనాభరావు, పి.రామకృష్ణ, ప్రసన్నకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

పారాది బ్రిడ్జి సమస్య తొలగించాలి


ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు

- ఉపముఖ్యమంత్రికి వినతి

సాలూరు: పారాది బ్రిడ్జి సమస్య పరిష్కారానికి చొరవతీసుకోవాలని సాలూరు లారీ ఓనర్స్అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను కోరారు. ఈ మేరకు ఆదివారం ఉపముఖ్యమంత్రిని పట్టణంలోని ఆయన గృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు రాజన్నదొరతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అత్యధిక లారీ పరిశ్రమ కలిగిన సాలూరు నుంచి పారాది మీదుగా బొబ్బిలి, రాయగడ మీదుగా ఒడిశాలోని చంబల్‌పూర్, ఝూర్సుగుడ, మధ్యప్రదేశ్‌లకు అత్యధికంగా రవాణా జరుగుతుందని చెప్పారు. పారాది బ్రిడ్జి పాడైపోయినందున చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మక్కువ,సీతానగరం రోడ్డు బాగోలేనందున ప్రత్యామ్నాయంగా ఆ మార్గం గుండా కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. గమ్య దూరం కంటే సుమారు 30 కి.మీ అధికంగా వెళ్లాల్సి వస్తుండడంతో ప్రయాణ,ఆర్థిక భారం పడుతోందని వాపోయారు. కావున పారాది బ్రిడ్జి పక్క నుంచి రోడ్డు మార్గం ఇచ్చేలా చొరవ చూపి,సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.మక్కువ రోడ్డుకు సంబంధించి ఇప్పటికే రూ.55 కోట్లు ప్రభుత్వం మంజూరుచేసిందని, పనుల జాప్యంపై ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చీపురుపల్లిలో దొంగల అలజడి

- రెండిళ్లలో చోరీకి యత్నం
- ఒక ఇంటిలో 20 తులాల బంగారం, కేజీన్నర వెండి మాయం
- మరో ఇంట్లో పాయసం తిని పరారైన దుండగులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ బృందం
- చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించిన డీఎస్పీ, సీఐ, ఎస్సై


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న డీఎస్పీ చక్రవర్తి


వివరాలు సేకరిస్తున్న సీఐ ఉపేంద్ర, ఎస్సై సన్యాసినాయుడు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చీపురుపల్లి: చాలాకాలం తరువాత పట్టణంలో దొంగల అలజడితో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కపడ్డారు. ఒకే రాత్రి సమీప ప్రాంతాల్లోని రెండు నివాసాల్లోకి చొరబడిన దుండగులు స్థానికులను భయాందోళనకు గురిచేశారు. ఒక ఇంటిలో ఎలాంటి సొత్తు లభించకపోవడంతో వెళ్లిపోయిన దుండగులు మరో ఇంట్లో 20 తులాల బంగారం, కేజీన్నర వెండి చోరీకి పాల్పడ్డారు. ఇదిలా ఉండగా చోరీకి పాల్పడిన దుండగులు ఒక ఇంటిలో డైనింగ్ టేబుల్‌పై ఉన్న జీడిపప్పు, మరో ఇంట్లో ఫ్రిజ్‌లో ఉన్న పాయసం తీసుకుని తిన్నారు. ఇదే తరహాలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో తర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓ ముఠా వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. చోరీలకు గురైన ఇళ్లను డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్.ఉపేంద్ర, ఎస్సై ఎ.సన్యాశినాయుడు సోమవారం పరిశీలించారు. అంతేకాకుండా క్లూస్ టీమ్‌లను రప్పించి చోరీ జరిగిన ఇళ్లలో దుండగుల వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. చోరీకి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

20 తులాల బంగారం, కేజీన్నర వెండి అపహరణ

పట్టణంలోని ఆంజనేయపురంలో గల విజయకృష్ణ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఆప్టికల్స్ వ్యాపారి తమినాన గంగాధర్ కుటుంబంతో కలిసి ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళంలోని అత్తవారి ఇంటికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఆదివారం రాత్రి ఇంటికి వెనుక వైపు ఉన్న కిటికీ గ్రిల్ డోర్‌ను తొలగించి ఇంటిలోకి చొరబడ్డారు. మాస్టర్ బెడ్‌రూంలో ఉన్న బీరువా తాళాలు విరగ్గొట్టి వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. అనంతరం బీరువాలో ఉన్న 20 తులాల బంగారం, కేజీన్నర వెండి అపహరించుకుపోయారు. అంతేకాకుండా ఫ్రిజ్‌లో ఉన్న పాయసం తీసుకుని చక్కగా తిన్నారు. సోమవారం ఉదయం అపార్ట్‌మెంట్‌లో ఉన్న నివాసితులు కిటికీ తొలగించి ఉండడాన్ని గమనించి బాధితుడు గంగాధర్‌తో బాటు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎంతో కాలంగా కష్టపడి సంపాదించుకున్న బంగారం ఒకేసారి చోరీకి గురవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి దేముడు నివాసం వెనుక ద్వారం తాళాలు పగలగొట్టి చొరబడిన దుండగులు చిల్డ్రన్స్ బెడ్‌రూంలోకి ప్రవేశించి కబోర్డుల్లో ఉన్న బట్టలు, వస్తువులు చిందరవందరగా పడేశారు. దేవుడి గదిలోకి వెళ్లి వస్తువులను చెల్లాచెదురు చేశారు. తరువాత హాలులో డైనింగ్ టేబుల్‌పై ఉన్న జీడిపప్పు తిన్నారు. అంతలో మాస్టర్ బెడ్‌రూంలో పడుకున్న దేముడు భార్య లేచిన శబ్దం రావడంతో దొంగలు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ చోరీకి సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఏనుగుల విధ్వంసం


పంటపొలాల్లో ఏనుగులు

భామిని: మండలంలోని నల్లరాయిగూడ సమీపంలో ఏనుగుల గుంపు తిష్ఠ వేసి వరి పంటను తినివేస్తున్నాయని గిరిజన రైతులు వాపోతున్నారు. కొద్ది రోజులుగా నాలుగు ఏనుగుల గుంపు తివ్వాకొండల పరిసరాల్లో సంచరిస్తూ గిరిజన గూడల చుట్టూ ఉన్న పంట పొలాలను నాశనం చేస్తూ సోమవారం పంటను తినివేస్తున్నట్లు రైతులు గమనించారు. వరి పంట చేతికి వచ్చే సమయంలో కలిగిన నష్టాలు తీర్చలేనివని వాపోతున్నారు.ఏనుగుల బాధలు తప్పించాలని నల్లరాయిగూడ సర్పంచ్ బిడ్డిక గొయింతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక ప్రసాద్‌లు అధికారులను కోరుతున్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- ఐదుగురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ


కేసు వివరాలు చెబుతున్న సీఐ చంద్రశేఖర్, చిత్రంలో నిందితులు, ఆయుధాలు

శృంగవరపుకోట: మండలంలో సర్వత్రా చర్చనీయాంశమైన గిరిజన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. మండలంలోని కొత్త అడ్డతీగ గ్రామంలో గిరిజన యువకుడిపై దాడి చేసి చంపారన్న వార్తల్లో వాస్తవం లేదని పోలీసులు నిర్ధారించారు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్ మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన పాంగి అర్జున్(35) గ్రామానికి దగ్గరలో ఉన్న అనాథాశ్రమంలో పనిచేస్తూ, కుటుంబంతో ఉంటున్నాడని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1గంట సమయంలో పుట్టకొక్కు కోసమని జిందాల్ భూముల్లో పొదలవెనుక అర్జున్ వెదుకులాడుతుండగా, అదే సమయంలో సమీప గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మూడు నాటుతుపాకులతో అడవి పందుల వేటకోసం అదే ప్రాంతానికి వచ్చారన్నారు. గుబురుగా ఉన్న పొదల్లో కదలికలు చూసి అడవి పంది అని భావించి, ఐదుగురు వ్యక్తుల్లో ఒకరైన పాంగి వీరన్న నాటుతుపాకీతో కాల్చాడు. దీంతో అర్జున్ గాయపడి కేకలు వేయడంతో వారంతా గమనించి అర్జున్ తుపాకీ దెబ్బలు తిని పడి ఉండడం చూసి, పరారయ్యారు. కొన ఊపిరితో ఉన్న అర్జున్‌ను 108లో ఎస్.కోట ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనకు కారకులైన పాంగి వీరన్న, శిరగం అంగురయ్య, ఒంటి దాలిబాబు, సవర్ల రాము, సవర్ల సోములును అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్టు సీఐ చెప్పారు. వారి నుంచి 3నాటుతుపాకీలు, గన్‌పౌడర్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సైలు తారకేశ్వరరావు, లోవరాజు తదితర సిబ్బందిని సీఐ అభినందించారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదానికి గురైన హోటల్

సాలూరు: పట్టణంలోని చార్‌మినార్ హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంపై అగ్నిమాపకశాఖాధికారి యు.సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హోటల్ వద్ద సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది వాహనంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేశారు.

పశువుల శాలలు దగ్ధం


కాలిపోయిన పశువుల శాలలు

బొబ్బిలి: మండలంలోని జె.రంగరాయపురంలో ముగ్గురు రైతులకు చెందిన పశువుల శాలలు దగ్ధమయ్యాయి. దీపావళి పండగ సందర్భంగా తారాజువ్వలు ఎగసిపడడంతో గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి అప్పలనాయుడు, యామల సూర్యనారాయణ, తెర్లి రమణల శాలలు దగ్ధమవుతున్నట్లు గమనించి మంటలు ఆర్పేలోగా శాలలన్నీ పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

- డిసెంబర్ 3న పురస్కారం ప్రదానం
- నవంబర్ 30న గురజాడ స్వగృహంలో జ్యోతిప్రజ్వలన, భారీ ర్యాలీ
- ఆహ్వాన పత్రాలు ఆవిష్కరించిన సమాఖ్య


గురజాడ సాహితీ చైతనోత్సవం ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం అందజేయనున్నట్టు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధానకార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. గురజాడ గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30న నిర్వహించే మహాకవి గురజాడ సాహితీ చైతన్యోత్సవంలో భాగంగా గురజాడ స్వగృహంలో వారి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తామన్నారు. దేశభక్తిగీతాలు, గురజాడ వాడిన వస్తువులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన సాహితీ సదస్సులో ఆంధ్రాయూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ జర్రా అప్పారావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు గురజాడ సాహిత్యంపై ప్రసంగిస్తారని తెలిపారు. వక్తృత్వం పోటీ విజేతల ప్రసంగం ఉంటుందన్నారు. జాతీయస్థాయిలో ఎంపిక చేసిన పదిమంది కవులు స్వీయకవితా పఠనం చేస్తారన్నారు. డిసెంబర్ 3న సాయంత్రం ఆనందగజపతి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, మాజీ ఎంపీ డాక్టర్ ఝాన్సీలక్ష్మి, నవసాహితీ చైన్నై సంస్థ అధ్యక్షుడు సూర్యప్రకాష్ చేతుల మీదుగా చంద్రబోస్‌కు పురస్కారాన్ని ప్రదానంచేస్తామన్నారు. కార్యక్రమానికి ముందు ఈపు విజయకుమార్ దర్శకత్వంలో భోగరాజు సూర్యలక్ష్మి బృందం ఆధ్వర్యంలో కేవలం మహిళలతో మాత్రమే నిర్వహించే కన్యాశుల్కంలోని అపూర్వ ఘట్టాన్ని ప్రదర్శిస్తారన్నారు. సమావేశంలో సమాఖ్య కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు, సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, నాలుగెస్సుల రాజు, మానాప్రగడ సాహితీ, గురజాడ ఇందిర, బి.సూర్యలక్ష్మి, చక్రవర్తి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.